ప్రజాశక్తి

సోమవారం 25 నవంబర్ 2024

5

పార్వతీపురం మన్యం

అదానీ కంపెనీలతో ఒప్పందాలను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గౌతమ్ అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అవినీతి గౌతమ్ అదానీని అరెస్టు చేయాలని, కూటమి ప్రభుత్వం ఆదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దుచేయాలని, అదానీకి ఇచ్చిన భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రజల సంపదను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. అవినీతికి పాల్పడిన అదానీ కంపెనీలతో విద్యుత్ ఒప్పందాలు రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసుకోవాలని, అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ అవినీతి, రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన ఒప్పందాలు బహిర్గతం చేయాలని విశాఖ డేటా సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వరికో రూలు...పత్తికో రూలా?

- తడిసి మోపెడవుతున్న తెల్ల బంగారం రవాణా ఛార్జీలు
- రెండు జిల్లాలకు ఒకే కొనుగోలు కేంద్రం
- ఆందోళనలో రైతులు

వాహనంలో పత్తిని తరలిస్తున్న రైతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేసే బాధ్యతల నుంచి తప్పించుకునే మార్గాలను గత కొంతకాలంగా ప్రభుత్వాలు వెతుకుతున్నాయి. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టిన రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్న పాలకులు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడంలో విఫలమవుతున్నాయి. ఒకప్పుడు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించిన ప్రభుత్వాలు క్రమేణా ఆ బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నాలు మొదలు పెట్టాయి. పంటలు కొనుగోలు చేయడం తమ బాధ్యత కాదనే సంకేతాలిస్తూ రైతులను ప్రయివేటు మార్కెట్ వైపు మళ్లిస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే మార్కెట్లో ఎక్కువ ధర పలికితే సమస్య లేదు. అయితే ప్రయివేటు మార్కెట్ ధర తక్కువ పలుకుతున్నప్పుడు ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో గానీ, ఇప్పుడున్న ప్రభుత్వం హయాంలో గానీ పంటల కొనుగోలులో లోపభూయిష్టంగా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభిస్తోందా లేదా అన్న విషయం పరిశీలించి రైతులు నష్టపోకుండా చూసేందుకు ప్రభుత్వం ముందడుగు వేయడం లేదు. ఫలితంగా రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోవడమే కాకుండా వ్యవసాయం సంక్షోభంలో పడ్డానికి దారి తీస్తోంది. ఈ ఏడాది పత్తి పంటకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.7120 నుంచి రూ.7500 వరకు ఉంది. కానీ ఈ మద్దతు ధర పొందిన రైతులు వేళ్ళమీద లెక్కపెట్టే స్థాయిలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

జిల్లాలో ఈ ఏడాది సీజన్‌లో మొదటి విడత పికింగ్‌లో పత్తి దాదాపు 20వేల క్వింటాళ్ల వరకు దిగుబడి అవుతుంది. జిల్లాలో ఎక్కువగా సాలూరు, పాచిపెంట, మక్కువ, భామిని, సీతంపేట, కురుపాం, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల్లో పత్తి పంట అధికంగా పండిస్తున్నారు. విజయనగరం జిల్లాలోనూ కొన్ని మండలాల్లో పత్తి పంట సాగవుతోంది. ఇంత పెద్ద ఎత్తున దిగుబడి అయ్యే రెండు జిల్లాల్లో పత్తి కొనుగోలు కేంద్రం కేవలం ఒకే ఒక్కటి ఏర్పాటు చేయడంపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం, కాటన్ కార్పొరేషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు రైతుల పాలిట శాపంగా మారాయి. అటు రాజాం, పాలకొండ, భామిని, కురుపాం, కొమరాడ మండలాల నుంచే కాక ఇటు పాచిపెంట, మక్కువ మండలాల నుంచి కూడా పత్తిని ఒక్క కొనుగోలు కేంద్రానికే రవాణా చేయాల్సి ఉంది. రవాణా చేయడానికి ఛార్జీలు చెల్లించబోమని ప్రభుత్వం ప్రకటించింది. రామభద్రపురం మండలంలోని ముచ్చర్లవలస వద్ద వున్న ప్రతు జిన్నింగ్ మిల్లు కే రెండు జిల్లాల నుంచి పత్తిని రవాణా చేయాలని అధికారులు చెప్పడం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టం గా కనిపిస్తోంది. ఈ కొనుగోలు కేంద్రానికి పత్తిని తరలించేందుకు రవాణా ఛార్జీలు కూడా చెల్లించకపోవడంతో రైతులు ఎక్కడికక్కడ గ్రామాల్లోనే ప్రయివేటు వ్యాపారులకు అతి తక్కువకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం వల్ల ఒక్కో రైతు క్వింటాకు వెయ్యి రూపాయల వరకు నష్టపోయిన పరిస్థితి దాపురించింది. అదే వరి పంట కొనుగోలు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం పత్తి పంటకు పూర్తి భిన్నంగా వుంది. మన్యం జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం 183 కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు నిర్దేశించిన రైస్ మిల్లులకు ధాన్యం రవాణా చేయడానికి ఛార్జీలు చెల్లిస్తోంది. పత్తి కొనుగోలు కేంద్రానికి రవాణా చేయడానికి ఛార్జీలు చెల్లించకపోవడమే కాకుండా రెండు జిల్లాలకు ఒకే ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులను ప్రయివేటు మార్కెట్ వైపు మళ్లించే కుట్ర దాగి వుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో వరి పంట తర్వాత ఎక్కువగా సాగయ్యేది పత్తి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం వరి పట్ల ఒక నిబంధనలు, పత్తి పంట కొనుగోలు విషయంలో మరో రకమైన మార్గదర్శకాలు జారీ చేయడం వివక్షను సూచిస్తోంది. పీకల్లోతు అప్పుల్లో కూరుకు పోయిన రైతులు మరింత ఊబిలోకి దిగిపోయేలా ప్రభుత్వ విధానాలు వుండడం తో వ్యవసాయ రంగం సంక్షోభం వైపు పయనిస్తోంది.

ప్రజలపై భారాలు సరికాదు

ఎస్‌కెఎం, కార్మిక సంఘాల ఆధ్వర్యాన బైకు ర్యాలీ

ప్రజాశక్తి - పాలకొండ

పన్నులు కట్టేది ప్రజలు, బ్యాంకుల్లో డిపాజిట్లు సామాన్య, మధ్యతరగతి ప్రజలవి కానీ భారీగా రుణాలు, రుణ మాఫీలు ఉండేది కార్పొరేటర్లకు. ఈ విధమైన తప్పుడు విధానాలు మార్చుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరిస్తూ ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల వద్ద పెద్ద ఎత్తున తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సమన్వయ సమితి పిలుపు ఇచ్చింది. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీని పాలకొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వల్లూరు సత్యనారాయణ, సీనియర్ రైతు సంఘం నాయకులు ఖండాపు ప్రసాదరావు ప్రారంభించగా భాసూరు, నవగాం మీదుగా వీరఘట్టం, జియ్యమ్మవలస, పెదమేరంగి, ఖడ్గవలస, పార్వతీపురం, కొనసాగి సీతానగరం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ బంటు దాసు మాట్లాడుతూ రైతు సంఘాలు చేసిన ఉద్యమం సందర్భంగా ప్రధాని మోడీ ఇచ్చిన హామీని అమలు చేయాలని, ప్రజలపై భారాలు మోపుతున్న విధానాన్ని విరమించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ బహుళ జాతి సంస్థలకు రూ.19 లక్షల కోట్లు రుణ మాఫీ, రాయితీలు ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకురావడానికి ఎందుకు మీన మెసాలు లెక్కిస్తున్నారని ప్రశ్నించారు. సిపిఎంఎల్ నాయకులు శ్రీనునాయుడు మాట్లాడుతూ పన్నులు కట్టేది ప్రజలు, లాభాలు కాంట్రాక్టర్లకు, బ్యాంకుల్లో డిపాజిట్లు సామాన్య మధ్యతరగతి ప్రజలు, భారీగా రుణాలు, రుణ మాఫీలు కార్పొరేటర్లకు అప్పజెప్తున్న ప్రభుత్వ విధానం మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు మాట్లాడుతూ సంఘటిత శక్తితో కార్మికుల లోకం సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కొత్తగా తెచ్చిన కార్మిక వ్యతిరేక కార్పొరేట్ అనుకూల 4 లేబర్ కోడ్లనును విరమించాలిని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల పరిరక్షణ చట్టములకు సవరణ చట్టం 2023 ఉపసంహరించాలని, ఆదివాసీ, అటవీ నివాసాల హక్కులను పరిరక్షించాలని గిరిజన హక్కుల సంఘం నాయకులు రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఐలు జిల్లా కార్యదర్శి పి.సంఘం మాట్లాడుతూ రైతుల పాలిట ఉరితాడుగా ఉన్న విద్యుత్ బిల్లును ఉపసంహరించాలని, గృహ వినియోగదారులకు, చిన్న వ్యాపారులకు, వ్యవసాయ మోటర్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించరాదని అన్నారు. ఎఐటియుసి నాయకులు టి.జీవ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థల్లోనే కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గరుగుబిల్లి సూరయ్య మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న తోటపల్లి కాలువలు ఆధునీకరణ, జంపర్ కోట రిజర్వాయర్, జంఝావతి ప్రాజెక్ట్‌పై రెండు రాష్ట్రాల మధ్య వివాదాన్ని పరిష్కరించుకొని నిధులు ఇచ్చి పూర్తి చేయాలని వెంగళరాయ, రావాడ గెడ్డ ఆధునీకరణ, పెద్దగెడ్డ, పెదలంకలో, సీతానగరం ఆనకట్ట ఆధునీకరణ పనులకు కావాల్సిన నిధులు ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు నరసింహమూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావువివిధ సంఘాల నాయకులు పిట్ట రమణ, త్రినాధ్, పి.సీతమ్మ, గురిబిల్లి అప్పలనాయుడు, కాద రాము, కె.రామ్మూర్తి నాయుడు, జనార్దన్ రావు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం పురవీధుల్లో కొనసాగుతున్న బైకు ర్యాలీ

వీరఘట్టంలో కొనసాగుతున్న బైకు ర్యాలీ

పార్వతీపురం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న కార్మిక, కర్షక, ఉద్యోగ సంఘాల సమితి ఆధ్వర్యాన నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పాలకొండలో ప్రారంభమైన ర్యాలీ పార్వతీపురం చేరింది. సీతానగరంలో ముగియనుంది. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, రైతు సంఘం ఉపాధ్యక్షుడు బంటు దాసు,సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, రమణారావు ర్యాలీ లో పాల్గొన్నారు .

వీరఘట్టం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు నిరసనగా ఈనెల 26న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ పాలకొండలో ప్రారంభమైన బైక్ ర్యాలీ వీరఘట్టంకు చేరుకుంది. కార్యక్రమంలో పలువురు ప్రజాసంఘాల, కార్మికసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి

విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

దేశం, రాష్ట్రంలో మహిళలకు, విద్యార్థినిలకు రక్షణ కరువైందని, వారి భద్రత బాధ్యత రాష్ట్ర కూటమి ప్రభుత్వానిదేనని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. విశాఖలో లా విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడిని ఖండిస్తూ ఆదివారం స్థానిక బాలికల వసతి గృహలో ఐద్వా, ఎస్ఎఫ్ఐ, శ్రామిక మహిళా సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ కలకత్తా ట్రైనీ డాక్టర్ ఘటన మరువకముందే లా విద్యార్థిపై క్రూరమైన దాడి జరగడం దారుణన్నారు. మహిళలపై దాడులకు విశాఖ అడ్డాగా మారుతుందని, ఈ దాడి పట్ల సమాజం తల దించుకునేలా ఉందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరై పారుతోందని, గంజాయి ఒక మోడల్ అయ్యిందని, ఇది చాలా అన్యాయమని తెలిపారు. విచ్చలవిడిగా రాష్ట్రంలో ఇటువంటి మత్తు పదార్థాలను చలామణి చేయడంతో యువత, ప్రజానీకం బానిసై మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారని వెంటనే వాటిని అరికట్టాలని అన్నారు. శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేట్ , కార్పొరేట్ విధానాల వల్లే మహిళలపై దాడులు జరుగుతున్నాయని, గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామన్న మాటలు ప్రకటనలు గానే తేలుస్తున్నాయని అన్నారు. ప్రతిరోజు ఎక్కడో ఒకచోట మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, మద్యం పట్ల ఉన్న శ్రద్ధ మహిళల రక్షణపై ఎందుకు లేదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని, పోర్న్ వెబ్ సైట్లను రద్దు చేయాలని, పోక్సో చట్టం ద్వారా వెంటనే విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, జస్టిస్ వర్మ సిఫార్సులను అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు, జిల్లా ఉపాధ్యక్షులు టి.అఖిల్, జాయింట్ సెక్రెటరీ పి. రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు హెచ్.సింహాచలం, కె.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో వంటలను తనిఖీ చేస్తున్న డిడి అన్నదొర

గురుకులంలో తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మల్లి గురుకులం పాఠశాలను డిడి ఎం.అన్నదొర ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఉదయం అల్పాహారం కింద పూరీ ఇవ్వాల్సి ఉండగా అన్నం పెట్టారు. శనివారం ఇడ్లీకి బదులు ఫలహారం పెట్టారు. మెనూ ప్రకారం తమకు సక్రంగా భోజనం పెట్టడం లేదని విద్యార్థులు డిడికి ఫిర్యాదు చేశారు. సందర్శన సమయంలో ప్రిన్సిపల్, డిప్యూటీ వార్డెన్ అందుబాటులో లేరు. ఈ విషయమై పిఒకు నివేదిక అందజేశామని తెలిపారు. అనంతరం ప్రతిభా కళాశాలను సందర్శించారు. అక్కడ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నట్టు డిడి తెలిపారు.

గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి -మక్కువ

మండల కేంద్రమైన మక్కువ శంబర రోడ్డులో ఆర్లి రాజారావుకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఆదివారం కావడం ఎదురుగా ఉన్న చర్చి ప్రార్ధన సమయంలో అగ్ని ప్రమాదం జరగడంతో భక్తులు వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా ప్రతి ఏటా ఇదే కాలంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటా ఉండటం గమనార్హం.

29 నుంచి ఎంఎస్ఎంఇల సర్వే

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఎంఎస్ఎంల (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలుః) సర్వే ఈ నెల 29 నుండి పునఃప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పోర్టల్, Udyam Assist platformలో నమోదు ప్రక్రియను సులభతరం చేయడానికి, ఎంఎస్ఎంఇల పనితీరును పెంచడం, వేగవంతం చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో ఎంఎస్ఎంఇలను గుర్తించడానికి సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసిందని, గతంలో చేపట్టిన సర్వే ఎన్నికల కారణంగా నిలిచిపోవడంతో మళ్లీ సర్వేను పునఃప్రారంభించినట్లు చెప్పారు. ఎంఎస్ఎంఇ ఫార్మలైజేషన్ సర్వే కలెక్టర్ల పర్యవేక్షణలో జరుగుతుందని, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వాటాదారుల మధ్య సమన్వయం కోసం జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని అన్నారు. సంక్షేమ సహాయకులు, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ సహాయకులు, వెటర్నరీ అసిస్టెంట్, ఏఎన్ఎం, గ్రామ సర్వే అసిస్టెంట్, మహిళా పోలీస్, పంచాయతీ కార్యదర్శి, విఆర్ఓ , ఇంజనీరింగ్ అసిస్టెంట్,ఎనర్జీ అసిస్టెంట్ మొబైల్ యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. సర్వే యాప్ మండలస్థాయి ప్రత్యేక అధికారులతో సర్వే కార్యకలాపాలను పర్యవేక్షిస్తుందని, క్షేత్రస్థాయిలో సమన్వయం చేస్తుందన్నారు. ఈ సర్వే 2025 ఫిబ్రవరి 1 నాటికి పూర్తవుతుందని తెలిపారు. సర్వే కోసం ఎంఎస్ఎంఇ సర్వే అండ్ సపోర్ట్ (MSME Survey & Support) అనే మొబైల్ యాప్‌ను రూపొందించామని చెప్పారు. తద్వారా వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందేందుకు అర్హులు అవుతారని, బ్యాంకు రుణ సదుపాయాలు సులభతరం అవుతాయని, ఎంఎస్ఎంఇల్లో జరిగే చెల్లింపుల జాప్యంను నివారించేందుకు సమాధాన పోర్టల్‌తో అనుసంధానించడం జరుగుతుందని ఆయన వివరించారు.

విహారంలో విషాదం

- బైక్ అదుపు తప్పి లోయలో బోల్తా
- భార్య మృతి, భర్త, పిల్లలకు గాయాలు
- కుటుంబంలో నెలకొన్న విషాదం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భారతి

ప్రజాశక్తి - సీతంపేట

ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఆ కుటుంబ సభ్యులు అడలి వ్యూ పాయింట్ వద్ద సరదాగా గడిపారు. ఇంతలోనే మృత్యువు ఆ కుటుంబంపై పగబట్టింది. ఇంటికి వస్తుండగా సంభవించిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్త, పిల్లలకు గాయాలయ్యాయి. దీంతో అప్పటి వరకూ సరదాగా ఉన్న ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ విషాదకర సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పాలకొండ మండలం ఇందిరానగర్ కాలనీకి చెందిన దుప్పాడ భారతి (33), భర్త దుర్గారావు, పిల్లలు మేఘన, పల్లవి కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం సీతంపేట మండలం అడలి వ్యూ పాయింట్‌ను సందర్శించేందుకు వచ్చారు. అక్కడ సరదాగా గడిపిన అనంతరం ఇంటికి తిరిగి వస్తుండగా బిరింది గూడ జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పి లోయలో బోల్తా పడింది. దీంతో భారతి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త దుర్గారావు, పిల్లలు గాయాల పాలయ్యారు. ఆమె మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇందిరానగర్ కాలనీలోని పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్.. భారతి. భర్త దుర్గారావు తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈ సంఘటనతో ఇందిరా నగర్ కాలనీలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. ఎస్ఐ వై.అమ్మన్నరావు కేసు నమోదు చేశారు.

పిఎం సూర్యఘర్ కవరైతే రూ.కోటి నజరానా

- ఒక్కొక్క కనెక్షన్‌కు వెయ్యి రూపాయలు ప్రోత్సాహం
- ఐదు మోడల్ గ్రామాలు ఎంపిక
- ప్రభుత్వ కార్యాలయాలకు, వాణిజ్య సముదాయాలకు స్మార్ట్ మీటర్లు
- 'ప్రజాశక్తి'తో విద్యుత్‌శాఖ ఎస్ఇ కె.చలపతిరావు ముఖాముఖి

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కార్యక్రమంలో భాగంగా వందశాతం సౌర విద్యుత్ వినియోగంలోకి వచ్చిన గ్రామానికి కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయల నజరానా ప్రకటించిందని విద్యుత్ సర్కిల్ ఎస్ఇ కె.చలపతిరావు చెప్పారు. ఇందు కోసం జిల్లాలో ఐదు మోడల్ గ్రామాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. జిల్లాలో స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాలకు, వాణిజ్య సముదాలయాలకు బిగించామన్నారు. విద్యుత్‌శాఖ చేపడుతున్న పనులను ఆయన 'ప్రజాశక్తి'తో ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లో....

-ప్రజాశక్తి పార్వతీపురం



◆ పిఎం సూర్యఘర్ యోజనకు జిల్లాలో స్పందన ఎలా ఉంది?

జిల్లాలో ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలకు దీనిపై అవగాహన పెరగాలి. దీని సక్సెస్ రేట్ ఎంత వరకు ఉంటుందనే అనుమానాలు జనంలో ఉన్నాయి. వాటిని నివృత్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నాం.

◆ ఈ పథకం ముఖ్యోద్దేశం ఏమిటి?

పర్యావరణహితమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ తమ ఇంటి అవసరాలకు సరిపోయినంత వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించవచ్చు.

◆ జిల్లాలో ఇంతవరకు ఎంతోమంది దరఖాస్తు చేశారు? ఎన్ని ఇళ్లల్లో ఇన్ స్టాల్ చేశారు?

జిల్లాలో ఇప్పటి వరకు 355 మంది దరఖాస్తు చేసుకున్నారు. 34 ఇళ్లల్లో ఇన్ స్టాల్ చేశాం.

◆ ఈ పథకం కింద అందజేస్తున్న రాయితీలేమిటి?

ఇంటి పైకప్పు పై కనీసం వంద చదరపు అడుగుల స్థలంలో ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయొచ్చు. ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. వెయ్యి రూపాయల విద్యుత్ బిల్లు చెల్లిస్తున్న వారికి సోలార్ విద్యుత్ ఏర్పాటైన తర్వాత రూ.338 బిల్లు వస్తుంది. దీని వల్ల ఏడాదికి రూ.8వేలు ఆదా అవుతుంది. ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ప్రభుత్వ రాయితీ రూ.30వేలు, రెండు కిలో వాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్‌కు రూ.60వేలు, మూడు కిలోవాట్లకు రూ.78వేలు రాయితీ ఇస్తుంది. అలాగే మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు రూ.2 లక్షల వరకు వడ్డీలేని రుణం మంజూరు చేయబడుతుంది. వినియోగదారుడు పెట్టిన పెట్టుబడి నాలుగేళ్లలో రికవరీ అవుతుంది.

◆ ఈ పథకం కింద ఇంకా అందిస్తున్న ప్రోత్సాహకాలేమిటి?

ఈ పథకం కింద జిల్లాలో ఐదు గ్రామాలను మోడల్ గ్రామాలుగా ఎంపిక చేశాం. ఐదువేలకు పైగా జనాభా కలిగిన ఐదు గ్రామాల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని వంద శాతం తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. మక్కువ, వీరఘట్టం, కురుపాం, పెదపెంకి గ్రామాల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాం. ఈ గ్రామాల్లో వందశాతం సౌర విద్యుత్ వినియోగంలోకి వచ్చిన గ్రామానికి కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయల నజరానా ప్రకటించింది. అంతే కాకుండా ప్రతి సోలార్ విద్యుత్ కనెక్షన్‌కీ వెయ్యి రూపాయల ప్రోత్సాహం స్థానిక సంస్థల కు చేరుతుంది.

◆ స్మార్ట్ మీటర్ల బిగింపు ఎంతవరకు జరిగింది?

ముందుగా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జరుగుతోంది. వీటి వల్ల వినియోగదారులకు ఇబ్బంది ఏమీ వుండదు. ఖర్చవుతున్న విద్యుత్ ఎంతనేది లెక్క తేలుతుంది.

◆ 1912 కాల్ సెంటర్ ఉద్దేశం ఏమిటి?

విద్యుత్ స్తంభాలు వాలిపోవడం, వైర్లు కిందకి వేలాడడం వంటి సంఘటనలు, లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తినప్పుడు కార్యాలయాలకు రాకుండా ఈ కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయొచ్చు. వెంటనే సమస్యలు పరిష్కారమవుతాయి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

◆ జిల్లాలో సిబ్బంది కొరత వుందా?

కింద స్థాయిలో సిబ్బంది కొరత లేదు. ఎఇల కొరత వుంది. జిల్లాలో 21 మంది ఎఇలకు 11 మందే ఉన్నారు .

◆ ట్రూ అప్ ఛార్జీల గురించి ఏమంటారు?

ట్రూ అప్ ఛార్జీలనేవి గతంలోనూ ఉన్నాయి. కొత్తగా వచ్చినవి కాదు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజలు మారాలి. సెల్ ఫోన్ రీఛార్జ్ రేట్లు, నిత్యావసర వస్తువుల ధరలు ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయి. విద్యుత్ కూడా నిత్యావసర వస్తువు లాంటిదే .

గొంతు తడపని మంచినీటి పథకాలెందుకు?

- గ్రామాల్లో ఉత్సవ విగ్రహాల్లా ఉన్న తాగునీటి పథకాలు
- బోర్లు, బావులపైనే ఆధారం
- పట్టించుకోని అధికారులు
- ఇది చలివేంద్రి పంచాయతీలో తాగునీటి దుస్థితి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు వెచ్చించి మంచినీటి పథకాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నుంచి వచ్చే నీటితో ఇప్పటికీ గొంతు తడపడం లేదు. దీంతో వాటిని ఎందుకు నిర్మించారో అర్థం కావటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రానికి కూతవేట దూరంలో చలివేంద్రి, బూరుగు గ్రామాలు ఉన్నాయి. చలివేంద్రి గ్రామంలో 451, బూరుగులో 129 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గ్రామంలో తాగునీటి పథకాలు పనిచేయడం లేదు. చలివేంద్రి గ్రామంలో 5 బోరు బావులు, బూరుగు గ్రామంలో 2 బావులు, 3 బోరు బావులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఉత్సవ విగ్రహంలా మంచినీటి పథకం

ఏటా గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడుతుందని ప్రజల విన్నపం మేరకు గత టిడిపి ప్రభుత్వంలో 90వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకాన్ని రూ.30 లక్షల అంచనా వ్యయంతో చలివేంద్రి గ్రామంలో ఏర్పాటు చేశారు. అప్పట్లో కొన్ని రోజులు పని చేసి అది మూలకు చేరింది. అప్పుడప్పుడు వచ్చిన ఫిర్యాదుల మేరకు గ్రామీణ నీటి సరఫరా విభాగ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టడం ఆనవాయితీగా వస్తుంది. రక్షిత మంచినీటి పథకం వద్దే గ్రామస్తులు నీరు పట్టుకునేందుకు ట్యాప్‌లు కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇవి మూడు రోజులు ముచ్చటగా పనిచేసే మూలకు చేరడంతో వాటి ద్వారా నీరు రావడం లేదు. ఫలితంగా బోర్లు పైన ఆధారపడి గొంతును తడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

లక్షలాది రూపాయలు నీటి పాలు

బూరుగ గ్రామంలో గత ప్రభుత్వ హాయాంలో గ్రామం ముందు లక్షలాది రూపాయలు వెచ్చించి జలజీవన్ మిషన్ పనులు చేపట్టారు. ఇక్కడ బోరు బావి తవ్వకాలతో పాటు గ్రామంలో రెండు వీధులలో పైప్ లైన్ కూడా ఏర్పాటు చేశారు. అయితే బోరు బావి తవ్వకాలు జరిగిన చోట సున్నపురాయి ఏర్పడటం వల్ల అందులో నుంచి నీరు రావటం లేదని, గ్రామంలో ఉన్న బావి పైన ఆధారపడి కలుషిత నీరు అయినప్పటికీ దాహార్తిని తీర్చుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని కలమట పెద్ద అచ్చియ్య, చిన్న అచ్చయ్య తదితరలు వాపోతున్నారు. ఆలోచన లేకుండా అధికారులు ఇష్టానుసారంగా బోరుబావి తవ్వకాలు జరిపి లక్షలాది రూపాయలు ప్రజాధనాన్ని వృథా చేశారని గ్రామస్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. పాఠశాల దగ్గర ఉన్న బోరు నీరు తాగేందుకు బాగున్నప్పటికీ అక్కడికి ఉపాధ్యాయ సిబ్బంది రానివ్వటం లేదని, ఒకవేళ పాఠశాలకు సెలవులు ఇచ్చిన వాటికి తాళం వేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. చివరకు బావి పైన ఆధారపడి గొంతు తడుపుకోవల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, గ్రామంలో ఎక్కడ శుభకార్యం జరిగిన గ్రామానికి సమీపంలో ఉన్న కూరగాయల రైతులకు బతిమలాడుకుని బావిల్లో నీటిని వాడుకుని శుభకార్యాలు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని, ఈ నెల దాటితే బావిలో నీరు పూర్తిగా ఎండి పోతాదని, కూరగాయల రైతులు సహకారంతో వారి పంటలకు సాగు చేసే నీరును బావిలోకి మళ్లించి కాలం గడప వలసిన పరిస్థితి వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రామీణ నీటి సరఫర విభాగ అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బూరుగ గ్రామంలో లక్షలతో తవ్వకాలు జరిపి వధాగా పడి ఉన్న జలజీవన్ మిషన్

ఫీజులకు ఇబ్బంది కలిగించే కాలేజీల అఫిలియేషన్ రద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో గల జూనియర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నికల్, ఐటిఐ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కళాశాల ఫీజులు విషయంలో ఏ రకమైన ఇబ్బంది కలిగించినా ఆ యాజమాన్యం, ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఫీజు రీయింబర్సెమెంటు మొత్తం కళాశాల యాజమాన్యం అకౌంట్లో జమ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కావున విద్యార్థులను తరగతులకు అనుమతినిచ్చే విషయంలో గానీ, పరీక్ష ఫీజు కట్టించుకునే విషయంలో గానీ, హాల్ టికెట్లు జారీలో గానీ, ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు అనుమతినిచ్చే విషయంలో ఇబ్బందులు కలిగిస్తే ఆ కళాశాల ఎఫిలియేషన్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల ఫీజు చెల్లింపు, హాల్ టికెట్ల జారీ, ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతులు తదితర అంశాలకు ముడిపెట్టి వారి అవకాశాలు దెబ్బ తీస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

శ్రీకాకుళంలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ నియోజకవర్గంలోని మాజీ సైనిక ఉద్యోగులను శ్రీకాకుళం పరిధిలోనే కొనసాగించాలని సైనిక సంక్షేమ అధ్యక్షులు దుప్పాడ పాపినాయుడు కోరారు. ఆదివారం అయన స్థానిక మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన తర్వాత పాలకొండ నియోజకవర్గంలో ఉన్న తమను పార్వతీపురం పరిధిలోకి చేర్చి తమను విజయనగరం పరిధిలోకి వెళ్లమనడం దారుణమని, తమకు విజయనగరం వెళ్లాలంటే రానూపోనూ 220 కిలోమీటర్లు పడుతుందని అన్నారు. తమకు ఇది ఆర్థికభారమవుతుందని, అందుకే తమను శ్రీకాకుళం పరిధిలోనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రసన్న కుమార్, కార్యదర్శి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

26న మండల కేంద్రాల వద్ద ధర్నా

ప్రజాశక్తి - సీతానగరం

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేస్తున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ప్రజలకు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అచ్చంనాయుడుకు నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

అచ్చెన్నాయుడు కుటుంబాన్ని ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగికి చెందిన వైసిపి మండల ఉపాధ్యక్షులు, ఎఎంసి మాజీ ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు తండ్రి అచ్చెన్నాయుడు ఇటీవల మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని అచ్చెన్నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు ఎస్.చిన్నంనాయుడు, పి.ధవలేశ్వరరావు, వైశ్యరాజు గోవిందరాజు, సర్పంచ్ ప్రతినిధి అలజంగి ఎలీషా, పి.పరిశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బుడా చైర్మన్‌కు ఎమ్మెల్యే అభినందనలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

బుడా చైర్మన్ ఎంపికైన మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడును ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తన క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈనెల 27న జరగబోయే బుడా చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని కోరుతూ ఎమ్మెల్యేను ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి లక్ష్మునాయుడు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకట నాయుడు, మాజీ వైస్ ఎంపిపి గొట్టాపు గౌరి, తెంటు అప్పలనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాములమ్మకు సన్మానం

ప్రజాశక్తి - సీతంపేట

ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ సంఘం ఏర్పాటు చేసిన సాంఘిక శాస్త్ర దినోత్సవంలో భాగంగా సీతంపేట జిసిడిఒ రాములమ్మ రాష్ట్ర ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయినిగా ఆదివారం విజయనగరంలో సన్మానించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ, విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు, ఇతర జిల్లాల విద్యాశాఖాధికార్లు వారి చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేసి సాల్వాతో సత్కరించి సన్మానం చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర, ఎస్.పెద్దవలస పంచాయతీలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఆ శాఖ డిఇఇ కె.గోపాలరావు నాయుడు తెలిపారు. మావుడి సబ్ స్టేషన్ పరిధిలో ఆర్‌డిఎస్-ఎస్ పనులు చేపట్టనున్న సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రైతులకు ఆటంకం లేకుండా ఉదయం 4 గంటల నుండి 10 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

తూర్పు కాపు సంఘం బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - కురుపాం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో తూర్పు కాపు సంఘం సభ్యులంతా ఐక్యం కావాలనికాపు సంఘం జిల్లా నాయకులు సూచించారు. ఆదివారం కురుపాంలో తూర్పు కాపు సంక్షేమ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. విజయనగరంలో డిసెంబర్ 1న తూర్పు కాపు కార్తీకవన సమారాధన, ఆత్మీయత కలయిక జరగనున్నట్లు, ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని ప్రతి ఒక్క తూర్పు కాపు కుటుంబ సభ్యులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా తూర్పు కాపు సంఘం నాయకులు జి.అప్పలనాయుడు, ఈశ్వరరావు,కష్ణ మోహన్ మహంతి, రమేష్ నాయుడు, శ్రీనివాసరావు, కరుణ వంశం, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

పవన్ ప్రచారంతోనే బిజెపి గెలుపు

ప్రజాశక్తి - సాలూరు

ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి విజయం సాధించడం వెనుక జనసేన అధినేత పవన్ కల్యాణ్ కృషి ఉందని నియోజకవర్గ జనసేన నాయకులు జర్జాపు సూరిబాబు చెప్పారు. ఆదివారం స్థానిక జనసేన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి విజయం కోసం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రచారం నిర్వహించారని చెప్పారు. తెలుగు రాష్ట్ర ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో పవన్ కల్యాణ్ ప్రచారం చేయడం తో అన్ని చోట్లా బిజెపి గెలిచిందని చెప్పారు. సమావేశంలో జనసేన కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, నాయకులు జటి నాయుడు, లింగాల సింహాచలం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు సూరిబాబు

రక్షిత మంచినీటి పథకం నిర్మించరూ...

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కిల్లాడ పంచాయతీ కిల్లాడలో రక్షిత మంచినీటి పథకం నిర్మించాలని ఆ గ్రామస్తులు అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ గ్రామంలో వంద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ కుటుంబాల నీటి వినియోగానికి చిన్న ట్యాంకులు రెండు ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి 15ఏళ్ల క్రితం నిర్మించగా, మరొకటి ఇటీవల కాలంలో నిర్మించిన సింటెక్ వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటుచేశారు. ఈ ట్యాంకులు చిన్నవి కావడంతో గ్రామస్తులకు నీరు సరిపడా తాగునీరందడంలేదు. దీంతో గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఇప్పుడే ఈ సమస్య ఇలా ఉంటే ఇక వేసవిలో ఆ సమస్య ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మరోపక్క పండగలకు, పెళ్లిళ్లకు వాటర్ ట్యాంక్ ద్వారా నీరు తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు సరిపడా తాగునీరందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్.సత్యం వద్ద ప్రస్తావించగా నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు.

వేసవిలో తాగునీటి సమస్య ఉంటుంది

ప్రస్తుతం ఉన్న వాటర్ ట్యాంక్‌లోకి ఊట బావి నుంచి గ్రావిటేషన్ పైప్లైన్ ద్వారా ట్యాంక్‌లోకి నీరు వస్తుంది. వేసవిలో ఊటబావి నీరు తగ్గుతుంది. దీనితో పాటు ట్యాంకు చిన్నది కావడంతో మాకు తాగునీరు సరిపడడం లేదు.

కె.వరలక్ష్మి,
ఎంఎంఎస్ అధ్యక్షులు, కిల్లాడ.

శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకు

మరో రక్షిత పథకం మంజూరు చేయండి

గ్రామంలో వంద కుటుంబాలకు నీరు సరిపోవడం లేదు.కొత్తగా మరో రక్షిత మంచినీటి పథకం కానీ, కొత్త బోరు కానీ మంజూరు చేయాలి. వేసవిలో నీటి కొరత ఉంటుంది. ఇప్పటికే అధికారులకు వినతులు సమర్పించాం.

కె.కాంతారావు, కిల్లాడ .

మండల స్థాయిలో నేడు గ్రీవెన్స్

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని ప్రజా సమస్యలపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీరఘట్టం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాలకొండ : ఇకపై ప్రతి సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. కావున పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆదివారం ఒక ప్రకటనలో ఆయన కోరారు.

పార్వతీపురం రూరల్: ప్రతి సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.రూపేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా పాల్గొన్నారు. అలాగే మండల ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించుకొని పరిష్కారాన్ని పొందవచ్చునని తెలిపారు.

నిబంధనలకు పాతర

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక నగరపంచాయతీలో ఎవరికి నచ్చినట్టు వారు నిర్మాణాలు చేస్తున్నారు. తమ దగ్గర ఎటువంటి పత్రాలు లేకున్నా, నిబంధనలు పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాలు జోరందుకుంటున్నాయి. అయినా అధికారులు చోద్యం చూడడంతో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. పట్టణంలో జెట్టివారి వీధిలో పంచాయతీ స్థలంలో దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఏకంగా రెండు షాపులను నిర్మించడంతో చూసిన వారంతా ముక్కున వేలేసుకుంటున్నారు. ఆ స్థలంలో ఎవరికీ ఎటువంటి పట్టా కానీ, పంచాయితీ తీర్మానం కానీ లేవు. అయినప్పటికీ నిర్మాణాలు జరుగుతుండడంతో చర్యలు తీసుకోవాల్సిన నగరపంచాయితీ అధికారులు చోద్యం చూడడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణం వెనుక ఎవరు ఉన్నారన్నది పట్టణంలో తీవ్ర చర్చ జరుగుతుంది. ప్రధాన రహదారికి దగ్గరగా ఉన్న ఈ విలువైన స్థలంలో దర్జాగా నిర్మాణాలు జరుగుతుంది. నిర్మాణం చేపడుతున్న వ్యక్తి వద్ద స్థలానికి సంబంధించిన పత్రాలు లేనప్పటికీ కొందరికి చేతులు తడిపి ఈ నిర్మాణం చేపడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై కమిషనర్ సర్వేశ్వరరావు దృష్టిలో పెట్టగా, నిర్మాణానికి సంబంధించిన విషయం తన దృష్టికి రాలేదని, సిబ్బందిని పంపి వివరాలు సేకరిస్తామని అన్నారు.

డిఎం నిరంకుశ విధానాలు విడనాడాలి

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక ఆర్‌టిసి డిపో మేనేజర్ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఆదివారం ఎన్ఎంయు ఆధ్వర్యాన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా చైర్మన్ కె.శంకరావు మాట్లాడుతూ ఎడిసిల అక్రమ సఫలింగ్ రద్దు చేయాలని, డ్రైవర్, కండక్టర్లకు టిమ్ మిషన్లో డెబిట్స్ రద్దు చేయాలని, బస్సులను మెరుగైన కండిషన్‌లో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు డిపో కార్యదర్శి వి.రాజేష్, సుబ్బారావు, ఎం.వైకుంఠం, ఎస్‌టి రావు, డివి రమణ, ఎపి ప్రసాద్,సభ్యులు పాల్గొన్నారు.

తమ్మినాయుడు చెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని కొత్తవలస పరిధిలో గల తమ్మినాయుడు చెరువును కాపాడాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తవలస పరిధిలో గల సర్వే నంబర్ 137లో గల 8.77 ఎకరాల విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ చెరువు కబ్జా చేసేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. భూ రికార్డుల్లో తమ్మినాయుడు ట్యాంకు అని స్పష్టంగా ఉన్నప్పటికీ దాన్ని మార్చేందుకు అధికారులు చర్యలు చేపట్టడం బాధాకరమన్నారు. గత కొన్నేళ్లుగా పార్వతీపురంలోని ప్రభుత్వ చెరువులన్నీ దాదాపు కబ్జాలకు గురై జిరాయితీగా మారుతున్నాయన్నారు. కలెక్టర్ స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

కాగితాలపైనే పాత్రునికోనేరు సుందరీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని జగన్నాధపురం నడిబొడ్డిన గల పాత్రుని కోనేరు సుందరీకరణ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ కోనేరును సుందరీకరించేందుకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు 2021 జూన్‌లో జరిగిన సాధారణ సమావేశంలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో ఆమోదం తెలిపింది. అయితే ఈ సుందరీకరణ పనులు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ పరిధిలో గల 1, 2, 29, 30 వార్డుల ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ఈ పాత్రని కోనేరును సుందరీకరించి, వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అప్పట్లో కోనేరు నిర్మించిన కుటుంబ వారసులతో పాటు, ఆయా వార్డుల యువత, వృద్ధులు, కోనేరు గట్లు కొంత ఆక్రమణకు గురైనప్పటికీ మిగిలి ఉన్న గట్లుపై సుందరీకరణ చేయాలని అప్పటి ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు పలుమార్లు వినతులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో కోనేరు సుందరీకరణకు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు అంచనాలు తయారు చేసి కౌన్సిల్ అజెండాలో పొందుపర్చడంతో మున్సిపల్ పాలకవర్గ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అయితే ఇంతవరకు కోనేరు సుందరీకరణ పనులు చేపట్టకపోవడం విచారకరమని, కూటమి ప్రభుత్వ హయాంలోనైనా ఈ సుందరీకరణ పనులు చేపట్టి జగన్నాధపురంలో గల నాలుగు వార్డుల ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రతో పాటు పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు కృషి చేయాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

కమిషనర్‌కు పాత్రుని కోనేరును చూపిస్తున్న జగన్నాథపురం వాసులు

జీతాలందక క్లాప్‌మిత్రుల అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

తమకు 15 నెలలుగా జీతాలందక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని కొట్టుగుమ్మడకు చెందిన క్లాప్ మిత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021 నుంచి క్లాప్ మిత్రులుగా విధులు నిర్వహిస్తున్నామని, ఈ పని తప్ప మరి ఏ విధమైన పనులకు వెళ్లడం లేదని తెలిపారు. సేకరించిన చెత్తను వేరే చోటికి డంపు చేస్తున్నామని, అయితే రిక్షాలు మరమ్మతులు గురైనా తమ సొంత డబ్బులతోనే బాగు చేసుకోవాల్సిన పరిస్తితి ఏర్పడిందని వారు వాపోయారు. 15 నెలలుగా జీతాలందక పోవడం వల్ల కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్లో ఉన్న తమ జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై ఎంపిడిఒ బి.వెంకటరమణ వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా క్లాప్ మిత్రులకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు చెల్లిస్తున్నామని, ఈ విషయమై తన దృష్టికి రాలేదని అన్నారు. పరిశీలించి క్లాప్‌మిత్రలకు జీతాలు చెల్లింపునకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

తులసిజోరి గిరిజనులకు రగ్గులు అందజేసిన తమన్నా ఫౌండేషన్ ప్రతినిధులు

గిరిజనులకు రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి - పాచిపెంట

తమన్నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొడ్డేపల్లి లక్ష్మి జ్ఞాపకార్థం మండలంలోని తులసిజోరిలో గిరిజనులకు ఆదివారం ఉచితంగా రగ్గులు పంపిణీ చేశారు. తొలుత లక్ష్మి చిత్రపటానికి నివాళులు అర్పించి అనంతరం గ్రామస్తులకు సీనియర్ ఎయిర్ వెటరన్ సాగి నారాయణరాజు చేతులమీదుగా రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిరణ్, మహిళా సమైక్య సభ్యులు ఫాతిమా, సాయిలక్ష్మి, బి.శ్రీనివాసరావు, విశ్వనాధ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సంచాలన ఫౌండేషన్ అధ్యక్షులు బొడ్డేపల్లి రామకృష్ణారావు నిర్వహించారు.

గురుకుల పాఠశాల ఉపాధ్యాయులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయులు గత అయిదు రోజులుగా శాంతియుత నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకర్రావు అన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో గురుకుల పాఠశాల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. గురుకుల పాఠశాలలో ఉదయం 5గంటల నుండి రాత్రి 9గంటల వరకు అలుపెరగకుండా పిల్లల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వాలు మొండి చేయి చూపడం అన్యాయమన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు శ్రమిస్తున్నప్పటికీ టిజిటిలకు రూ.12వేలు, పిజిటిలకు రూ.14వేలు, జూనియర్ అధ్యాపకులకు 16వేలు, పిఇటిలకు రూ.9,500, ఫిజికల్ డైరెక్టర్లకు రూ.12 వేలు మాత్రమే ప్రభుత్వాలు చెల్లిస్తున్నాయని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలనుసారం పనికి తగ్గ వేతనాన్ని చెల్లించాలన్నారు. భవిష్యత్తులో గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న 1633 మంది ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులను సీఆర్టీలుగా అప్‌గ్రేడ్ చేసి 2022 పిఆర్‌సి ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేపట్టండి

ప్రజాశక్తి - కురుపాం

ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేపట్టి సాగు నీరందించాలని మండలంలోని పెద్దగొత్తిలి సర్పంచ్ టి.లోకనాథం ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పెద్దగొత్తిలి పంచాయితీ పరిధిలో గల చప్పగొత్తిలిలో ఎత్తిపోతల పథకం నిర్మించి నేటికి ఆరేళ్లు అవుతుందని, కానీ పథకం మాత్రం వినియోగంలోకి రాలేదని అన్నారు. దీనివల్ల ఎంతో మంది రైతులకు సాగునీరు సకాలంలో అందక, వ్యవసాయం చేయలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో దరఖాస్తులు పెట్టినప్పటికీ కనీసం ఇప్పటివరకు ఎటువంటి స్పందన రాలేదని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన రైతులపై శ్రద్ధ చూఊపి ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేయించి, సుమారుగా 186 ఎకరాల భూమికి సాగునీరందించాలని కోరారు.

అధ్వానంగా బడ్నాయికవలస- కుంతాం రోడ్డు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని బడ్నాయికవలస కీము సెంటర్ నుంచి కుంతాం వెళ్లే రోడ్డు పరమ అధ్వాన్నంగా ఉంది. దీంతో గిరిజనులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పాడైపోయిన ఈ రోడ్డు సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, గెమ్మెల చిన్నారావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు పూర్తిగా పాడైపోయివడంతో ద్విచక్రవాహనాలు, ఆటోల రాకపోకలు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధ్వాన్నంగా ఉన్న ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

ఎంఇఒ - 1కు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్ కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండల విద్యాశాఖ అధికారి- 1కు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని ఎంఇఒ-1 అసోసియేషన్ ఎపి రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎంఇఒ- 1 అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. ఈ సమావేశంలో సింహాచలం మాట్లాడుతూ ఎంఇఒగా సుమారు 150 నుండి 300 మంది టీచర్ల జీతభత్యాలను చేస్తున్న ఎంఇఒ-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడం ఇబ్బందిగా ఉందన్నారు. విద్యాశాఖ తరపున అనేక కార్యక్రమాలను ఎంఇఒలు నిర్వహిస్తుండగా, ఎంపిడిఒలు తమ శాఖకు సంబంధంలేని అదనపు బాధ్యతలు అప్పగిస్తుండడం వల్ల ఎంఇఒలు పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంఇఒలకు విడుదల చేసిన జాబ్ చార్ట్ ఉత్తర్వులు జీవో 89కు విరుద్ధంగా చాలా చోట్ల డిఇఒలు అన్ని విధులను ఎంఇఒ-1 చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, ఈ విషయంలో జాబ్ చార్ట్ ఖచ్చితంగా అమలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. తమ సమస్యలపై ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారులకు ప్రాతినిధ్యం చేయడం జరిగిందన్నారు. తమ సమస్యలపై సానుకూలంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పర్యాటకులతో కిటకిటలాడిన అడలి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట పర్యాటక ప్రాంతాన్ని సందర్శించడానికి పర్యాటకులు తరలివచ్చారు. దీంతో కార్తీక మాసం చివరివారం కావడంతో సీతంపేట పర్యాటకులతో ప్రత్యేక పర్యాటక శోభ సంతరించుకుంది. అయితే పర్యాటకులు ఆడలి యు పాయింట్‌ను సందర్శించి తనవంపు సొంపులతో ఉన్న కొండలను కనువిందు చేసుకున్నారు. నీలి మేఘాలు, జలజల జారుతున్న మంచు కొండలు అందంగా దర్శనమిస్తాయి. అనంతరం ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌ను సందర్శించి పార్కులోని అందాలను ఆశీర్వదించారు. బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద విహార్ వద్ద ఉల్లాసంగా ఉత్సాహంగా డాన్సులు వేశారు. అబ్బురు పరిచే హర్రర్ పిక్చర్స్ 5డి థియేటర్లో వీక్షించారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి అందమైన పగోడాలను చూశారు.

అడలి వ్యూ పాయింట్ వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు